క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ పట్టణ ఏఈ ఎస్ శివశంకర్ శుక్రవారం తెలిపారు. పట్టణ పరిధిలోని 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వర కు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పట్టణంలోని అగ్రహారపేట, కోళ్లఫారమ్, అవని అపార్టుమెంట్, శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు, హెచ్‌పీ పెట్రోలు బంక్, రాజగోపాలపురం, శ్రీరామ్ నగర్, అశోక్ నగర్, జువ్వలపాళెం, విన్నమాల గేట్‌తోపాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

వెంకటగిరిలో...

వెంకటగిరి రూరల్: పట్టణంలోని పాలకేంద్రం 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ ముని రవిచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సబ్‌స్టేషన్ పరిధిలో వెంకటగిరి పట్టణం, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సూచించారు.

ఘనంగా చెంగాళమ్మ ఆలయ వార్షికోత్సవం



చందనాలంకరణలో చెంగాళమ్మ

చిట్టమూరు: మండలంలో ఆరూరులోని చెంగాళమ్మ ఆలయంలో శుక్రవారం తొమ్మిదవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో పురోహితులు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించి అమ్మవారి మూల విరాట్‌కు అభిషేకాలు చేశారు. అమ్మ వారు చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మూడురోజుల పాటు వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు పురోహితులు తెలిపారు.

కబడ్డీలో ఆరూరు సత్తా



కబడ్డీ పోటీలలో ప్రతిభ చాటిన కీర్తన, మోక్షిత

చిట్టమూరు: మండలంలోని ఆరూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో సత్తా చాటి మొదటి స్థానంలో నిలిచారని ఆ స్కూల్ హెచ్‌ఎం జేవీఎస్ లక్ష్మి శుక్రవారం తెలిపారు. తిరుపతిలో నిర్వహించిన ఈ పోటీలలో తమ స్కూల్ 9వ తరగతి విద్యార్థినులు మోక్షిత, కీర్తన జిల్లా జట్టు తరఫున ఆడి మొదటి స్థానంలో నిలిచారని చెప్పారు. తడ శ్రీసిటీలోని మ్యాజిక్ ఎయిర్ బస్ సంస్థ తరఫున పీటీ మాస్టర్ చైతన్య విద్యార్థినులకు కబడ్డీలో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. విద్యార్థినులను టీచర్లు, గ్రామస్తులు అభినందించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



నగదు విరాళం అందిస్తున్న పెంచలరాజు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్య అన్నదాన పథకానికి నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన కప్పపెంచలరాజు, ధర్మపత్ని సరస్వతి శుక్రవారం రూ.1,23,456 నగదును విరాళంగా అందించినట్లు ఆలయ ఏసీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎస్‌ఐ

కోట: బీసీ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదువుకోవాలని ఎస్‌ఐ పవన్‌కుమార్ సూచించారు. స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఎస్‌ఐ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో వార్డెన్ గజేంద్ర పాల్గొన్నారు.

చికెన్ ధరలు		9.8.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	107
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	222
లేయర్ చికెన్	:	190

మంగళకరం.. వరలక్ష్మీ వ్రతం



రాపూరు : మహావిష్ణువు ఆలయంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు

చిట్టమూరు : వరలక్ష్మీ వ్రతాన్ని జరిపిస్తున్న పురోహితులు






నాయుడుపేట: కరిమాణిక్య స్వామి ఆలయం వద్ద లక్ష కుంకుమార్చన పూజలు

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. మంగళ గౌరీ వ్రతం, లక్ష కుంకుమార్చనలు చేశారు. అష్టలక్ష్మీ దేవికి దీపారాధనలు చేశారు. వ్రతమాచరించిన భక్తులకు వాయినాలు అందించారు. పలు ఆలయాల వద్ద అన్నదానాలు చేశారు.

-సాక్షి నెట్‌వర్క్



చిల్లకూరు : ముత్యాలమ్మ ఆలయంలో కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు



సైదాపురం: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



రాపూరు : వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు



తడ: మాంబట్టులో సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు



ఓజిలి: లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న మహిళలు





నాయుడుపేట: గాజుల అలంకరణలో పోలేరమ్మ, పోతురాజులు, ఓజిలి: ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి



చిట్టమూరు : సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు





డక్కిలి: విశేషాలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి, చెంచులక్ష్మీ, సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

రోడ్డు నిర్మించారు.. సైడ్ బర్మ్ మరిచారు

దొరవారిసత్రం: గ్రామాల్లోని వీధుల సమస్య పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రోడ్లు నిర్మించారు. అయితే వాటి పక్కన సమాంతరం మట్టిని నింపే సైడ్ బర్మ్స్ మరిచారు. స్థానికంగా ఉన్న కూటమి నేతలు ఈ పనులు చేయడంతో అధికారులు మౌన ముద్రలో ఉన్నారు. ఆయా ప్రాంతాల్లోని అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా పనులు చేసినా, పర్యవేక్షించే అధికారులు సైతం చూసీ చూడనట్లు వెళ్లిపోవడంతో గ్రామాల్లోని వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి.

వీధుల్లో రోడ్లు వేసి వదిలేశారు.

మండలానికి రెండు విడతల్లో 31 సీసీ రోడ్లు నిర్మాణాలకుగాను రూ.2.18కోట్లు నిధులు మంజూరయ్యాయి. సీసీ రోడ్ల నిర్మాణం ఉచ్చూరు, నెలబల్లి, నేలపట్టు పంచాయతీల్లో తప్ప మిగిలిన అన్ని పంచాయతీల్లో ఈ పనులను దక్కించుకున్న కూటమి నాయకులు ప్రజలకు అవసరమైన వీధులను వదిలిపెట్టి అవసరం లేని దగ్గర, సులువుగా పనులు పూర్తి అయ్యే ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేశారు. నిబంధనలకు అనుగుణంగా లేకపోయినా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు దక్కించుకున్న కూటమి నాయకులు వీధుల్లో రోడ్లు వేశారే కానీ రోడ్డుకు ఇరుపక్కలా సైడ్ బర్మ్స్ పనులు చేయకుండా వదిలేయడంతో, ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ప్రమాదాలకు గురి కావాల్సివస్తోంది. పనులు పూర్తయిన తరువాత అన్ని వివరాలతో కూడిన బోర్డును రోడ్డు ప్రధాన మార్గంలో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. ఇవేవీ చేయకుండానే కూటమి నాయకులు బిల్లులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే 31 సీసీ రోడ్లుకు గాను 30 రోడ్ల నిర్మాణ పనులు నిబంధనల ప్రకారమే పూర్తి చేసినట్లు పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిచేయిస్తామని చెప్పారు.





కుప్పారెడ్డిపాళెం ఎస్సీ కాలనీలో కానరాని సైడ్ బర్మ్స్, వెదురుపట్టు ఎస్టీ కాలనీలో సైడ్ బర్మ్స్‌లేని సీసీ రోడ్డు

ప్రభుత్వ వైద్యశాల కంటే ప్రైవేటు ఆస్పత్రే నయం



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న సమతసైనిక్ దళ్ నాయకులు

డక్కిలి: ప్రభుత్వ ఆస్పత్రి కంటే ప్రైవేటు ఆస్పత్రిలో మెరుగైన సేవలందుతున్నాయని, దాన్ని కొనసాగించాలంటూ వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ప్రజలు విన్నవించుకున్నారు. ఆయన ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన ల్యాబ్ భవనాన్ని ప్రారంభించారు. అంతకుముందు కమ్మపల్లి రోడ్డు సెంటరులో ఆయన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో స్థానిక ఏపీజీబీ బ్యాంక్ సమీపం వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రి దగ్గర సమత సైనికదళ్ వెంకటగిరి నియోజకవర్గ అధ్యక్షుడు చిట్టేటి రాజా, మండల అధ్యక్షుడు అభిరామ్ ఆధ్వర్యంలో వెలికల్లు, మార్లగుంట పలు గ్రామాల ప్రజలు సుమారుగా 100మందికి పైగా ఎమ్మెల్యే కారును అడ్డుకున్నారు. ప్రైవేటు ఆస్పత్రిని కొనసాగించాలని ఆయన వేడుకున్నారు. కొంత మంది టీడీపీ నాయకుల ప్రోత్సాహంతో స్థానిక వైద్యాధికారిణి బిందు ప్రియాంక ఎమ్మెల్యే పేరు చెప్పి ప్రైవేటు ఆస్పత్రిని మూసివేయాలని డాక్టర్‌ను వేధిస్తున్నట్లు ఆయనకు వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే త్వరలో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, టీడీపీ అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు



రింగ్ బోరు వద్ద నీరు తెచ్చుంటున్న ప్రజలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని లోతువాని గుంట, ఎల్‌ఏ సాగరం, బీడీ కాలనీ తదితర ప్రాంతాల్లో రెండు రోజులుగా తాగునీటి సరఫరా లేక అక్కడి ప్రజలు అల్లాడి పోతున్నారు. ఇక్కడి తాగునీటి బోరుకు సంబంధించిన విద్యుత మోటారు కాలిపోయింది. జువ్వలపాళెం గ్రామ పరిధిలోని తాగునీటి బోర్ల వద్ద విద్యుత్ కెపాసిటర్లు చోరీ చేయడంతో అక్కడా ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం ప్రజలు రింగ్ బోర్ల వద్ద, వాటర్ క్యాన్‌లను కొనుగోలు చేస్తున్నారు.

నీట మునిగిన పండ్ల తోటలు



చెరువును తలపిస్తున్న మామిడి తోట

సైదాపురం: సైదాపురం మండలంలో గురువారం రాత్రి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి కొన్ని ప్రాంతాల్లో నిమ్మ, మామిడి తోటలు నీట మునిగాయి. తురిమెర్ల, ఆర్‌వైజీ పాళెం తదితర గ్రామాల్లో విస్తారంగా నిమ్మ, మామిడి తోటలు ఉన్నాయి. వర్షాలకు మామిడి తోటల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో రైతులు, లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

బదిలీ అయినా కుర్చీ వదలని సీసీ..!

కలువాయిలో ఓ ఉద్యోగి బాగోతం



కలువాయిలో అనధికారికంగా విధులు నిర్వర్తిస్తున్న సీసీ పుల్లయ్య

కలువాయి(సైదాపురం): కలువాయి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సీసీగా పనిచేస్తున్న పుల్లయ్యను డీఆర్డీఏ అధికారులు ఆరునెలల క్రితం అనంతసాగరం మండలానికి ఎఫ్‌పీఓసీసీగా బదిలీ చేసిననూ ఆయన కొందరి రాజకీయ నేతల సహకారంతో అనధికారికంగా ఇక్కడ సీసీగా పనిచేస్తున్నట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆయన అవినీతికి పాల్పడి నగదు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా అతని స్వగ్రామమైన బ్రాహ్మణపల్లెలో అతని భార్య ఉన్న గ్రూపులో అవకతకలకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయాలు బయటకు పొక్కకుండా ఉండేందుకు కలువాయిలోనే ఆయన విధులు నిర్వర్తిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై కలువాయి ఏపీఎంని సాక్షి ప్రశ్నించగా.. సమాధానం దాటవేశారు. ఇదే విషయమై డీఆర్‌డీఏ హెచ్‌ఆర్ ఖాజా రహంతుల్లా వివరణ కోరగా..అనంతసాగర్ మండలంలోనే పుల్లయ్య విధులు నిర్వర్తించాలని, అతనికి జీతం కూడా ఆ మండలంలోనే ఇస్తున్నారని, కలువాయిలో పని చేయడం సరికాదని సీసీ పుల్లయకు హితవు పలికినట్టు చెప్పారు. పీడీ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

కడివేడులో దర్జాగా కబ్జా



దేవర గుంటలో చెట్లు, పొదలు తొలగించి చదును చేస్తున్న ఆక్రమణదారులు

చిల్లకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దర్జాగా భూకబ్జాలు సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని కడివేడు రెవెన్యూ పరిధిలో ఉన్న మల్లవరపు కండ్రిగకు ఎదురుగా ఉన్న దేవరగుంటను చదును చేస్తున్నారు. చెట్టు పుట్టను తొలగిస్తూ ఆక్రమించుకుంటున్నారు. కడివేడు రెవన్యూలో మల్లవరపు కండ్రిగ మొత్తంగా సుమారు 150 ఎకరాల మేర గర్భకండ్రిగగా రికార్డుల్లో నమోదై ఉంది. అందులో 55 ఎకరాలకు పైగా దేవర చెరువు ఉంది. ఇందులో సుమారు 20 ఎకరాలకు పైగా చదును చేసి ఆక్రమించకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే అటు ఇరిగేషన్, ఇటు రెవెన్యూ అధికారులు కనీసం అటు వైపుగా కన్నెత్తి చూడక పోవడం గమనార్హం. చెన్నై– కోల్‌కతా జాతీయ రహదారి నుంచి దుగ్గరాజపట్నంకు వెళ్లే మార్గంలో రహదారి పక్కనే ఈ చెరువు భూములు ఉండడంతో విపరీతమైన ధరలు పలుకుతున్నాయి. దీంతో వీటిపై కన్నేసిన నాయకులు ఆక్రమణలకు తెర లేపారు. అయితే గతంలో ఇలాగే గుంటను ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా అప్పట్లో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి గుంట కింద సుమారు 54 ఎకరాల ఆయకట్టుకు నీటి పారుదల ఉందని అలాగే గుంట పూర్తిగా పంచాయతీరాజ్ నుంచి ఇరిగేషన్ శాఖలో విలీనం చేసినట్లు తేల్చారు. ఆక్రమణదారులను అడ్డుకుని వెనక్కి పంపారు. అయితే నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి ఆ భూములను స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. దీంతో కొద్ది రోజులుగా యంత్రాలతో గుంటలో చెట్టు పుట్టను చల్లచల్లగా తొలగించి చదును చేస్తున్నారు. ఇదే ఆక్రమణలు జరిగితే కుంట సగానికి పైగా పూడిపోయి వర్షాకాలం దుగ్గరాజపట్నం రోడ్డులో రాకపోకలు సాగించేందుకు కూడా వీలు లేకుండా పోతుంది. గుంట దిగువన సాగులో ఉండే సుమారు 54 ఎకరాల రైతులు వరి పండించుకునేందుకు అవసరమైన సాగు నీరు అందక చివరి తడులకు తీవ్ర అవస్థలు పడే అవకాశం ఉంది. దేవరగుంట ఆక్రమణలను అడ్డుకుని రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని గుంట కింద సాగులో ఉండే చిన్న సన్న కారు రైతులు కోరుతున్నారు.

సంయుక్తంగా సర్వే చేస్తాం

గత నెలలోనే బదిలీపై ఇక్కడికి వచ్చాను. కడివేడు రెవెన్యూ పరిధిలోని దేవర గుంట కింద సాగులో ఎంత విస్తీర్ణం ఉందనేది మాత్రం తెలుసు. గుంట పూర్తి విస్తీర్ణంతో పాటుగా హద్దులు ఎక్కడ వరకు ఉన్నాయనే విషయాలపై రెవెన్యూ అధికారులతో చర్చించి సంయుక్తంగా సర్వే చేపట్టి ఆక్రమణలు ఉంటే వెంటనే తొలగిస్తాం.

– తాగూరు, ఇరిగేషన్ ఏఈ, చిల్లకూరు